RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -154 పేజీలు - 04 వెల - 04/- ఆదివారం 12 జులై 2026

# పిల్లలే నిజమైన సంపద



**జనాభా నియంత్రణ కాదు..**

**జనాభా సంరక్షణ నినాదం రావాలి**

**దక్షిణాదిలో జనాభా తగ్గడం ఆందోళనకరం**

**ప్రపంచ జనాభా దినోత్సవంలో చంద్రబాబు**

**విజయవాడ,జులై 11 ఆంధ్ర ప్రగతి**

జనాభా నియంత్రణ కాదు.. జనాభా సంరక్షణ నినాదం రావాలని సీఎం చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు జనాభా తగ్గాలని అందరం కోరుకున్నామని, ఇద్దరికంటే ఎక్కువ మంది ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులని చెప్పామని అన్నారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయని తెలిపారు. పిల్లలే సంపద అనే మాటను నిజం చేస్తామన్నారు. విజయవాడలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గిపోతోంది. యువత ఆశలు, ఆకాంక్షలను సాకారం చేయాలి.**మిగతా 2లో...**



## మధుర గాయని ఎస్.జానకి కన్నుమూత

**వయోభారంతో మైసూరులో మృతి**



**మైసూరు,జులై 11 ఆంధ్ర ప్రగతి**

సుస్వరాల గొంతుక మూగబోయింది. తన గాన మాధుర్యంతో తెలుగు శ్రోతలను అలరించిన గంధర్వ గాయని పరలోకానికేగారు. ప్రముఖ గాయని ఎస్.జానకి కన్నుమూశారు. మైసూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 88 సంవత్సరాలు. వయోధిక సమస్యలతో ఆమె కన్నుమూసినట్లు మనవరాలు**మిగతా 2లో...**

## వియత్నాంలో విషాదం

**ఏపీ, తెలంగాణ వాసులతో వెళుతున్న బోట్ మునక... 15 మంది మృతి**

ప్రమాదంలో గాయపడిన పలువురి పరిస్థితి విషమం

ఫు క్వాక్ దీవి సమీపంలో అదుపుతప్పిన పడవ

రంగంలోకి దిగిన భారత ఎంబసీ.. సహాయక చర్యలు ముమ్మరం



2లో.

## బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా తెలంగాణ




**హైదరాబాద్, చెన్నై, బెంగళూరును కలుపుతూ కారిడార్**

**దేశంలో 7 బుల్లెట్ ట్రైన్లకు మూడు తెలంగాణకే**

**దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ**

**ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తి**

**వికసిత్ భారత్- సాంకేతికత పాత్ర అంశంపై అశ్వినీ వైష్ణవ్**

**హైదరాబాద్,జులై 11ఆంధ్ర ప్రగతి**

తెలంగాణకు రైల్వే బడ్జెట్‌ను కేంద్రం భారీగా పెంచిందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తెలంగాణ బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా మారబోతోందని అన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో వికసిత్ భారత్–2047.. సాంకేతికత పాత్ర' అనే అంశం నిర్వహించిన సదస్సులో కేంద్రమంత్రి**మిగతా 2లో...**

## పోక్సో కేసు పెట్టారని

# ఆరుగురి దారుణ హత్య

షాబాద్ పరిధిలో కనీవినీ ఎరుగని దారుణం

ఆరుగురని దారుణంగా హత్య చేసిన సైకో

అనంతరం గ్రామం నుంచి పరార్

నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు

సైకోను పట్టుకోవాలంటూ గ్రామస్థుల ఆందోళన

రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. పోక్సో కేసులో జైలు నుంచి వచ్చిన ఓ కిరతాకుడు నరమేథం సృష్టించాడు. ఏకంగా ఆరుగురిని దారుణంగా నరికి చంపాడు. ఆరుగురు హత్యకు గురైన ఘటన కలకలం సృష్టించింది.



2లో.

## కాళేశ్వరంగేట్లు మూస్తే కూలిపోతాయి

**కాళేశ్వరం బ్యారేజీల గేట్లు మూయడం ప్రమాదకరమని ముఖ్యమంత్రి హెచ్చరిక**

**పునరుద్ధరణ పూర్తయ్యే వరకు గేట్లు తెరిచే ఉంచాలని స్పష్టీకరణ**

**జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారమే మరమ్మతులు**

**బీఆర్ఎస్ నేతల కమిటీ సిఫార్సులను పక్కనపెడుతున్నట్టు వెల్లడి**

**గత ప్రభుత్వ అవినీతి వల్లే ప్రాజెక్టుకు ఈ దుస్థితి అని విమర్శలు**

**హైదరాబాద్,జులై 11 ఆంధ్ర ప్రగతి**

కాళేశ్వరం విషయంలో తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీమంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఎంపీ ఈటల అవాస్తవాలు చెప్పారని ధ్వజమెత్తారు. ఎంపీ ఈటల అంటే తమకు గౌరవమేనని తెలిపారు. ఆ వ్యాఖ్యలతో ఈటల తన గౌరవం పోగొట్టుకున్నారని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. **మిగతా 2లో...**




## పరిశోధనలు, స్టార్టప్‌లపై దృష్టి

**యువతకు గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపు**

**గురజాడ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పట్టాలు పంపిణీ**

**విశాఖపట్టణంజులై 11 ఆంధ్ర ప్రగతి**

యువత పరిశోధనలు, ఆవిష్కరణలు స్టార్టప్‌ల వైపు అడుగులు వేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో ఏయూ కన్వెన్షన్ హాల్లో జేఎన్టీయూ గురజాడ విశ్విద్యాలయం ప్రథమ స్నాతకోత్సవం జరిగింది. 2023, 2024, 2025 విద్యా సంవత్సరాలకు చెందిన ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలు**మిగతా 2లో...**




## పల్లి పల్లి మినిస్టర్..

**విజయవంతంగా ముగిసిన మంత్రి లోకేశ్ కొరియా పర్యటన**

**లోకేశ్ వేగాన్ని చూసి 'పల్లి పల్లి' (త్వరగా త్వరగా) మంత్రి అని ప్రశంసించిన కొరియన్లు**



## కడపలో కరోనాకు అడ్డుకట్ట వేయండి

**కలెక్టర్, డీఎంహెచ్ వోకు ఫోన్లో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆదేశం**

**కేసులు నమోదైన ప్రాంతాల్లో కొవిడ్ నిబంధనలు అమలు చేయండి**

**రద్దీ ప్రాంతాల్లో మాస్క్ ధరించడం తప్పనిసరి చేయండి : మంత్రి సవిత**

**అమరావతి, జులై 11 ఆంధ్ర ప్రగతి**

కడప జిల్లాలో కరోనా మహమ్మారి వ్యాప్తి చెందకుండా అడ్డుకట్ట వేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆదేశించారు. అదే సమయంలో కరోనా నివారణపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కొవిడ్ –19 నిబంధనలు అమలు **మిగతా 2లో...**



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# కాళేశ్వరంగేట్లు మూస్తే కూలిపోతాయి

**మొదటిపేజీ తరువాయి**

శనివారం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ప్రజలను తప్పుదోవ పట్టించేలా బిఆర్ఎస్ నేతలు, ఎంపి ఈటెల చేస్తున్న ప్రకటనలు దారుణమని అన్నారు. డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఎన్‌డిఎస్ఎ ఇచ్చిన నివేదిక, ఆదేశాల మేరకు తాము నడుచుకుంటున్నామని స్పష్టం చేశారు. కేంద్రంలో పలుకుబడి ఉన్న బిజెపి ఎంపిగా ఈటెల రాజేందర్ జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి, ఎన్‌డిఎస్ఎ ఆధ్వర్యంలో కాళేశ్వరం నీటిని ఎత్తి పోస్తే తమకు అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. ఎన్‌డిఎస్‌ను కలసి నీటిని ఎత్తి పోసేందుకు అనుమతి తెస్తే అందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం ఉండబోదన్నారు. ఎన్‌డిఎస్ఎ ఆదేశాల మేరకు మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచామని అన్నారు. మేడిగడ్డ గేట్లు మూస్తేనే కన్నెపల్లి వద్ద పంపులు నడపడానికి వీలుంటుంద న్నారు. అలా కాకుండా పారుతున్న నీటని ఎత్తిపోయడం సాధ్యం కాదన్నారు. ఇకపోతే పట్టిసీమ కోసం నీటిని వదులుతున్నామని చేస్తున్న ఆరోపణలపైనా సిఎం మండిపడ్డారు. పోలవరం పూర్తి చేసుకునే వరకు పట్టిసీమను కట్టుకున్న విషయం ఆనాటి మంత్రి హరీష్ రావుకు తెలియదా అన్నారు. కావాలనే బురదజల్లే ప్రయత్నాలు చేయడంపై మండిపడ్డారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నీటిని ఎత్తి ప ఓయడం కుదరదని సిఎం తేల్చారు. ఒకవేళ గేట్టు మూస్తే భద్రాచలం వరకు ముంపు తప్పదని ఎన్‌డిఎస్ఎ తెలిపిందని అన్నారు. కేసీఆర్ హయాంలో 2019 జూన్ 21వ తేదీన కాళేశ్వరం ప్రారంభించాక, కేసీఆర్ హయాంలోనే మేడిగడ్డ లోపాలు బయటపడ్డాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు బయటపడ్డాయని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని.. 2020 మే 18వ తేదీన ఈఈ రమణారెడ్డి కేసీఆర్ ప్రభుత్వానికి లేఖ రాశారని ప్రస్తావించారు. లోపాలు సవరించాలని అప్పట్లోనే ఇంజినీర్లు సూచించారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యంతో లోపాలు పెరిగి పెద్దవై బ్యారేజ్ కుప్పకూలిందన్నారు. 2022 జులై 14వ తేదీన వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని చెప్పారు. ఇప్పటికీ కన్నెపల్లి పంప్‌హౌస్ వినియోగంలోకి రాలేదని తెలిపారు. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ప్రస్తావించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఎన్డీఎస్ఏ కమిటీ ఏర్పాటు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలం కావని ఎన్డీఎస్ఏ తేల్చిచెప్పిందని అన్నారు. ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణ లోపాలపై.. గతంలోనే ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ఇచ్చిందని ప్రస్తావించారు. ప్రాథమిక, తుది నివేదికల్లో ఎన్డీఎస్ఏ అదే విషయం చెప్పిందని అన్నారు. లోపాలు సవరించాలని నిపుణులు చెప్పినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మొదట్లోనే స్పందించకపోవడంతో ఈ సమస్య పెద్దది అయిందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై పదేపదే అబద్దాలు ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పిల్లలే నిజమైన సంపద

**మొదటిపేజీ తరువాయి**

ఆడపిల్లలు ఇప్పుడు ఇంటికి భారం కాదు.. ఆస్తి. ఐటీ చదువుకోవాలని గతంలో ఆడపిల్లలను ప్రోత్సహించా. వరకట్నం కాదు.. ఆడపిల్లలకే ఎదురుకట్నం ఇచ్చే పరిస్థితి వచ్చింది. పిల్లలు వద్దనుకునే దంపతులు పెరగడం దురదృష్టకరం అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఏటా జనాభా తగ్గిపోతోంది. నగరాలు, అర్బన్ ప్రాంతాల్లో జనాభా బాగా తగ్గిపోతోంది. పిల్లల సంఖ్య తగ్గి.. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ఇంట్లో పెద్దలు లేకపోతే పిల్లల పెంపకంలో అనేక ఇబ్బందులు వస్తాయి. పిల్లలే మన రాష్ట్ర సంపద.. వారితోనే ఆర్థిక ప్రగతి. సరిపడా జనాభా లేకుంటే అనేక సమస్యలు వస్తాయని హెచ్చరించారు. పిల్లల్ని పెంచే బాధ్యతను తండ్రి కూడా తీసుకోవాలి. ఇంటిపని, వంటపని అనే తేడా లేదు. అన్నింట్లోనూ మగవాళ్లు సాయం చేయాలి. సంజీవిని కింద డిజిటల్ ఆరోగ్య రికార్డులు తీసుకుంటున్నాం. మెంటల్ సిక్‌నెస్ అతిపెద్ద సమస్యగా తయారైంది. సోషల్ మీడియా వల్ల మానసిక సమస్యలు పెరుగుతున్నాయి. విలువైన సమయం వృథా చేసుకుంటున్నారు. నేటి యువత యోగా, ధ్యానం అలవరచుకోవాలని సూచించారు. 60 ఏళ్లు దాటాక సమాజం కోసం పని చేయాలి. జీవితాంతం నేర్చుకుంటూనే ఉండాలి. నైపుణ్యాలు పెంచుకోవాలి. నియంత్రణ లేకుంటే ఏ టెక్నాలజీ అయినా ప్రమాదమే. ప్రతి ఒక్కరూ జీవితాన్ని సరిగా ప్లాన్ చేసుకోవాలి. జనాభా తగ్గిపోతే అనుకున్న లక్ష్యాలు సాధించలేం. 2040కే స్వర్ణాంధ్ర సాధించుకునే సత్తా మనకుందఅని చంద్రబాబు అన్నారు.ప్రపంచ జనాభా దినోత్సవం 2026 చరిత్రలో నిలిచిపోతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. విజయవాడలోని అంబేద్కర్ కళావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆసక్తిగా తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి వైద్యులు, వైద్య కళాశాలకు చెందిన విద్యార్థులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. నేడు ప్రపంచంలో ఎక్కడ చూసినా అత్యధిక ఆదాయం సంపాదించేవారు తెలుగువారేనని తెలిపారు. ఆరోజు ఐటీ గురించి మాట్లాడానని.. ఈరోజు ఏఐ గురించి మాట్లాడుతున్నానని చెప్పారు. ఆనాడు తల్లిదండ్రులు ఆడపిల్లలను చదివించాలంటే చాలా ఆలోచన చేసే వారని పేర్కొన్నారు. ఆనాడు త్వరగా పెళ్లిళ్లు చేసి అత్తగారింటికి పంపిస్తే బాధ్యత అయిపోతుందని అనుకునేవారని సీఎం చంద్రబాబు చెప్పారు. అప్పుడు మగపిల్లలకు పోటీగా ఆడపిల్లలు ఎదగాలని బాగా చదివించాలని చెప్పానని గుర్తుచేశారు. ఉద్యోగాల్లో, కాలేజీల్లో 33 శాతం రిజర్వేషన్లు కూడా ప్రవేశపెట్టామని తెలిపారు. అప్పుడు వరకట్నం ఉండేదని.. ఇప్పుడు ఎదురు కట్నం వచ్చిందని ప్రస్తావించారు. ఆడపిల్లలే ఎదురు కట్నం తీసుకునే పరిస్థితి వచ్చిందని తెలిపారు. నేడు భర్తల కన్నా భార్యల ఆదాయం ఎక్కువగా ఉందని వివరించారు. తనకన్న తన సతీమణి ఆదాయం, తన కొడుకు కంటే.. తన కోడలు ఆదాయమే ఇప్పుడు ఎక్కువగా ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# పోక్సో కేసు పెట్టారని ఆరుగురి దారుణ హత్య

**షాబాద్ పరిధిలో కనీవినీ ఎరుగని దారుణం**

**ఆరుగురని దారుణంగా హత్య చేసిన సైకో**

**రంగారెడ్డి,జులై 11 ఆంధ్ర ప్రగతి** రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. పోక్సో కేసులో జైలు నుంచి వచ్చిన ఓ కిరతాకుడు నరమేథం సృష్టించాడు. ఏకంగా ఆరుగురిని దారుణంగా నరికి చంపాడు. ఆరుగురు హత్యకు గురైన ఘటన కలకలం సృష్టించింది. షాబాద్ మండల కేంద్రంలోని దైవాలగూడలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ (28) అనే దుర్మార్గుడు ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్ కుమార్ కట్టుకున్న భార్య, ఇద్దరు కుమారులతో పాటు, తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో నరికి చంపాడు. మొదట షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం సమీపంలో ఉన్న మైనరు బాలిక (17)ఇంట్లోకి ప్రవేశించి.. ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి, నాయనమ్మ అడ్డు పడ్డారు. నిందితుడు వారిద్దరినీ కత్తితో పొడిచి చంపాడు. అనంతరం బాలికను దైవాల గూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య





చేశాడు. అనంతరం దైవాలగూడలోని తన ఇంటికొచ్చి భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4), దైవీక్షిత్ (2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు. ఆ తర్వాత తండ్రి అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి నేనే ఆరుగురిని చంపాను, నేను కూడా చనిపోతున్నానని చెప్పాడు. దీంతో అరుణ్‌కుమార్ పోలీసులకు సమాచారం అందించారు. షాబాద్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనాస్థలిని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి పరిశీలించారు. బాలికను వేధించాడని ఆమె తల్లి మే 16న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసి రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. బెయిల్‌పై తిరిగొచ్చిన నిందితుడు.. అర్ధరాత్రి ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిందితుడు రాజ్‌కుమార్.. ఏడేళ్ల క్రితం సరితను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయినా భార్యను ఇద్దరు పిల్లలను కూడా చంపడం అతని సైకో మనస్తత్వానికి నిదర్శనంగా చూడాలి. ఆరుగురి హత్య కేసులో మృతుల బంధువుల ఆందోళనతో షాబాద్‌లో ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిని తమకు అప్పగించాలంటూ షాబాద్-కంది రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. రాజ్‌కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయకపోతే మరొకరి ప్రాణం తీస్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడు రాజ్‌కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, ఏడు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు.

# వియత్నాంలో ఘోర ప్రమాదం..


## ఏపీ, తెలంగాణ వాసులతో వెళుతున్న బోట్ మునక... 15 మంది మృతి

**వియత్నాం జులై 11 ఆంధ్ర ప్రగతి**

వియత్నాంలో భారత పర్యాటకులతో ప్రయాణిస్తున్న ఒక స్పీడ్ బోట్ సముద్రంలో బోల్తా పడి మునిగిపోయింది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘోర ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతికూల వాతావరణం పరిస్థితుల కారణంగానే ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం.

ఓషన్ పెరల్ ఐలాండ్ కంపెనీకి చెందిన 'ఏజీ-26751' అనే పర్యాటక స్పీడ్ బోటులో భారత పర్యాటకులు సిబ్బందితో కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఫు క్వాక్ దీవి సమీపంలోని హోన్ మే రుట్ న్గోయి ప్రాంతంలో ప్రయాణిస్తున్న సమయంలో, బలమైన గాలులు మరియు అలల ఉధృతికి పడవ అదుపుతప్పి బోల్తా పడింది.

స్థానిక అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు సుమారు 21 మందిని రక్షించగా, వారిలో పలువురి పరిస్థితి



విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

ఒక మొబైల్ కంపెనీ తరఫున సుమారు 250 మంది డిస్ట్రిబ్యూటర్లు వియత్నాం పర్యటనకు వెళ్లారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు 35 మంది, తెలంగాణకు చెందిన వారు 40 మంది ఉన్నారు. మృతుల్లో మచిలీపట్నంకు చెందిన డిస్ట్రిబ్యూటర్ గిల్లి కిశోర్ భార్య జయశ్రీ, కడపకు చెందిన ముడియం శ్రీధర్ ఉన్నట్లు గుర్తించారు. గిల్లి కిశోర్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు సమాచారం.

కడపకు చెందిన నయీమ్ అనే డిస్ట్రిబ్యూటర్ ఆ బోటు ఎక్కకపోవడంతో తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మొత్తం ఐదు బోట్లలో పర్యాటకులు విహారానికి వెళ్లగా, అందులో ఒక బోటు ప్రమాదానికి గురైంది.

ఈ విషాద ఘటనపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం తక్షణమే స్పందించింది. ప్రమాదాన్ని ధ్రువీకరిస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన కార్యాలయం, సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని పేర్కొంది.

బాధితుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు హో చి మిన్ సిటీ, హనోయ్‌లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను (+84 36 281 7930, +84 91 552 37 14, +84 33 452 0414, +84 91 308 9165) కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.

# మధుర గాయని ఎస్.జానకి కన్నుమూత

**మొదటిపేజీ తరువాయి**

అప్సర విద్యుల ఇన్‌స్టా వేదికగా ప్రకటించారు. దక్షిణ భారత గానకోకిలగా పేరుగాంచిన ఆమె అన్ని భాషల్లో కలిపి ఆమె సుమారు 50 వేలకు పైగా పాటలను పాడారు. 1938 ఏప్రిల్ 23న గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్లపట్ల గ్రామంలో ఎస్.జానకి జన్మించారు. తెలుగు చలన చిత్రసీమంలో ఆణిముత్యాల్లాంటి పాటలకు ఆమె ప్రాణం పోశారు. తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో అద్భుతమైన పాటలను పాడారు. ఆమె గాన మాధుర్యానికి నాలుగు జాతీయ అవార్డులు సహా, 33 వివిధ సినీ అవార్డులు వరించాయి. సంగీత ప్రపంచానికి ఆమె సేవను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2013లో పద్మభూషణ్‌తో సత్కరించింది. తొలితరం ఘంటసాల నుంచి మలితరం బాలసుబ్రహ్మణ్యంతో కలిసి అద్భుత గీతాలు ఆలపించారు. పగలే వెన్నెలా అంటూ పలకరించిన మన జానకి లేదన్న విషయం సినీ ప్రపంచాన్ని దిగ్భ్రమకు గురిచేసింది. ప్రియమైన అమ్మమ్మ, దిగ్గజ గాయని ఎస్.జానకి కన్నుమూశారన్న వార్త తెలియజేయడానికి ఎంతో విచారిస్తున్నా. కుటుంబ సభ్యుల ప్రేమ, ఆప్యాయత మధ్య ప్రశాంతంగా మనల్ని విడిచి వెళ్లిపోయారు. ఆమె అద్భుతమైన జీవితాన్ని గడిపారు. తన గానంతో లక్షల మందికి ఆనందింపజేశారు. ఆమె ఒక దిగ్గజ గాయని. ఆమె పాటలు మధుర జ్ఞాపకాలు. ఈ దుఃఖ సమయంలో మా కుటుంబ ఏకాంతను గౌరవించాల్సిందిగా కోరుతున్నా' అని అప్సర తెలిపారు.

# పరిశోధనలు, స్టార్టప్‌లపై దృష్టి

**మొదటిపేజీ తరువాయి**

ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, ఎండోమెంట్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ గవర్నర్ నజీర్, వీసీ వీవీ.సుబ్బారావు, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సీఈఓ మయూర్ పట్నాల, వివిధ యూనివర్శిటీల వీసీలు, రిజిస్ట్రార్లు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగించారు. విద్యార్థులు కేవలం డిగ్రీలకే పరిమితం కాకూడదని గవర్నర్ వ్యాఖ్యానించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉపాధి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని దిశానిర్దేశర చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్, రోబోటిక్స్ వంటి సాంకేతికతను సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగించాలని మార్గనిర్దేశర చేశారు. విద్యార్థులను ప్రపంచస్థాయి పౌరులుగా తీర్చిదిద్దడంలో అధ్యాపకులు, విద్యాసంస్థలదే కీలక పాత్ర అని తెలిపారు. జేఎన్‌టీయూ జేవీ క్యాంపస్‌లో ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యాబోధన అందిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. క్యాంపస్‌లో జల సంరక్షణ పటిష్ఠంగా అమలు చేస్తున్నారని గవర్నర్ కొనియాడారు. సింగిల్ యూజ్ ఎ÷-లాస్టిక్‌ను నిషేధించడం, క్యాంపస్ అంతటా ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా యూనివర్శిటీని 'నెట్ జీరో క్యాంపస్'గా మార్చేందుకు కృషి చేస్తున్నారని కితాబు ఇచ్చారు. సమ్మర్ ఇంటర్న్‌గా సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు హాస్టల్ బిల్డింగ్‌ల రిపేర్లు, రినోవేషన్ పనులను స్వయంగా పూర్తి చేయడం గొప్ప విషయమని ప్రశంసించారు. జాతీయ విద్యా విధానం 2020 ద్వారా సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, నైతిక విలువలతో కూడిన విద్య అందుతుందని గవర్నర్ నజీర్ పేర్కొన్నారు.

--------

# కడపలో కరోనాకు అడ్డుకట్ట వేయండి

**మొదటిపేజీ తరువాయి**

చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ ను, డీఎంహెచ్ వో రవిబాబును ఫోన్లో ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కడపలో ఎనిమిది కరోనా కేసులు నమోదు కావడమే కాకుండా ఇద్దరు మృతి చెందడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే కరోనా కేసులు నమోదైన ప్రాంతాల్లో కొవిడ్ -19 నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. స్థానికుల్లో కరోనా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలు, ఆసుపత్రుల వద్ద మాస్క్ లు వాడకం తప్పనిసరి చేయాలన్నారు. జ్వరం, దగ్గు, ఇతర కోవిడ్ లక్షణాలున్న వారిని గుర్తించి ఐసోలేషన్ వార్డుకు తరలించాలన్నారు. కలెక్టర్ శ్రీధర్, డీఎంహెచ్ వో రవిబాబు మాట్లాడుతూ, ఎనిమిది కరోనా కేసులు మినహా కొత్తగా కేసులు నమోదు కాలేదన్నారు. ప్రస్తుత కరోనా వెరియంట్ వ్యాప్తిపై శాంపిళ్లను పూణే ల్యాబ్ కు పంపామన్నారు. ప్రస్తుతం నమోదైన కరోనా వేగవంతంగా వ్యాప్తి చెందుతుందా... నెమ్మదిగా సోకుతుందా..? అనేది ల్యాబ్ నుంచి వచ్చే రిపోర్టులో వెల్లడవుతుందన్నారు. ఇప్పటికే కరోనా కేసులు నమోదైన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టామని, బ్లీచింగ్ వెదజల్లామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కరోనా నమోదైన కుటుంబాల్లో సభ్యులకు కూడా తక్షణమే పరీక్షలు నిర్వహించి, పాజిటివ్ నమోదయితే వారిని కూడా ఐసోలేషన్ వార్డుకు తరలించాలన్నారు. నెగిటివ్ వస్తే... కొద్ది రోజుల పాటు వారి ఇళ్లల్లోనే ఐసోలేషన్ లో ఉంచాలని తెలిపారు. మరో మరణం సంభవించకుండా, ప్రస్తుతం ఐసోలేషన్ వార్డులో ఉన్నవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మేరకు కోవిడ్-19 టీకాలు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ ను, డీఎంహెచ్ వో రవిబాబుకు మంత్రి సవిత ఫోన్లో స్పష్టంచేశారు.

# బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

కిషన్‌రెడ్డితో కలిసి అశ్విని వైష్ణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్, చెన్నై, బెంగళూరును కలుపుతూ బుల్లెట్ ట్రైన్లు రానున్నాయని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఏపీకి ఇచ్చిన రైల్వే బడ్జెట్ రూ.880 కోట్లు మాత్రమే.. మోదీ సర్కార్ కేవలం తెలంగాణకే రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు చేపట్టామని వివరించారు. ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తయ్యిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో 40 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు నిధులు ఇచ్చామన్నారు. దేశంలో 7 బుల్లెట్ ట్రైన్స్ ప్రకటిస్తే.. అందులో తెలంగాణకు 3 దక్కాయని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కారణంగానే తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్స్ దక్కాయని వెల్లడించారు.ఇవి అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 1 గంట 10 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి ముంబైకి 2 గంటల 20 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి చెన్నయ్‌కి రెండు గంటల్లో వెళ్లవచ్చని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ దేశంలో పెద్ద మార్పునకు శ్రీకారం చుట్టబోతోంది. కొంతమంది దీని క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రెడిట్ కేవలం నరేంద్ర మోదీకి మాత్రమే దక్కుతుందని అన్నారు. 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని అశ్విని వైష్ణవ్ అన్నారు. వందేభారత్ రైళ్లు ప్రపంచస్థాయి సాంకేతిక ప్రమాణాలతో రూపొందించబడ్డాయని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. తెలంగాణకు ఇప్పటికే ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 36,000 కి.మీ. కొత్త రైల్వే ట్రాక్‌లు నిర్మించామని తెలిపారు. అలాగే 2,700 కి.మీ. డెడికేటెడ్ ÷-రెట్ కారిడార్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. దేశంలోని రైల్వే నెట్‌వర్క్‌లో 99.4శాతం విద్యుద్దీకరణ పూర్తయిందని, దీంతో డీజిల్‌పై ఆధారపడటం దాదాపు పూర్తిగా తగ్గిపోయిందని చెప్పారు. తెలంగాణకు ఇప్పటికే ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు.

# పల్లి పల్లి మినిస్టర్..

**విజయవంతంగా ముగిసిన మంత్రి లోకేశ్ కొరియా పర్యటన**

**లోకేశ్ వేగాన్ని చూసి 'పల్లి పల్లి' (త్వరగా త్వరగా) మంత్రి అని ప్రశంసించిన కొరియన్లు**

**జులై 11 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ చేపట్టిన వారం రోజుల దక్షిణ కొరియా పర్యటన అద్భుతరీతిలో విజయవంతమైంది. భారత్-కొరియా మధ్య వాణిజ్య, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే క్రమంలో ఈ పర్యటన ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. దక్షిణ కొరియా విదేశాంగ శాఖ అధికారిక ఆహ్వానం మేరకు ఈ నెల 5 నుంచి 11 వరకు సాగిన ఈ పర్యటనలో మంత్రి లోకేశ్, ఆయన బృందం అక్కడి ప్రభుత్వ, పారిశ్రామిక వర్గాల నుంచి విశేష గౌరవాన్ని అందుకుంది.

ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్ 50కి పైగా కార్పొరేట్ సంస్థల ఉన్నత స్థాయి ప్రతినిధులతో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఎల్జీ, హ్యుందాయ్, శాంసంగ్, బీఎన్‌కే ఫైనాన్షియల్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులతో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి. ముఖ్యంగా ఎల్జీ సంస్థ తమ ప్రధాన కార్యాలయానికి లోకేశ్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించి, ఉన్నత స్థాయి బృందంతో గౌరవ విందు ఇవ్వడం ఈ పర్యటనకు లభించిన ప్రాధాన్యతను చాటుతోంది. ఏపీలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న పారదర్శక పారిశ్రామిక విధానాలు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై లోకేశ్ ఇచ్చిన ప్రజెంటేషన్‌కు కొరియన్ కంపెనీల నుంచి అద్భుత స్పందన లభించింది. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తమ ఉన్నత యాజమాన్యంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయా సంస్థలు హామీ ఇచ్చాయి.

# ఈ నెల 13 నుంచి నంద్యాల బీజేపీ ఇన్ఛార్జుల పర్యటన.

**-నూతన ఇన్ఛార్జుల నియామకం తర్వాత తొలిసారిగా రాక**

**-మూడు రోజుల షెడ్యూల్ విడుదల చేసిన జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాలజూలై 11:** భారతీయ జనతా పార్టీ నంద్యాల జిల్లా నూతన ఇన్ఛార్జ్, కో-ఇన్ఛార్జుల నియామకం తర్వాత మొట్టమొదటిసారిగా ఈనెల 13, 14, 15 తేదీల్లో జిల్లా పర్యటన చేపట్టనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన మూడు రోజుల నియోజకవర్గాల వారీ షెడ్యూల్‌ను బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు శనివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు.

ఈ పర్యటనలో ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్ఛార్జ్ పీ.డీ. పార్థసారథి, కో-ఇన్ఛార్జ్ కాశీ విశ్వనాథ్ హాజరవుతారని, ఇందులో భాగంగా జిల్లాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించి, పార్టీ బలోపేతంపై సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

జూలై 13 సోమవారం

ఉదయం 10:30 గంటలకు బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పర్యటన (స్థానిక బీజేపీ కార్యాలయంలో).

సాయంత్రం 4:00 గంటలకు: డోన్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పర్యటన (స్థానిక బీజేపీ కార్యాలయంలో).

జూలై 14 మంగళవారం

ఉదయం 11:00 గంటలకు: నందికొట్కూరు అసెంబ్లీ పరిధిలోని కొత్తపల్లి మండలం శివపురం గ్రామంలో పర్యటన.

సాయంత్రం 4:00 గంటలకు: శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పర్యటన (స్థానిక బీజేపీ కార్యాలయంలో).

జూలై 15 బుధవారం జిల్లా కార్యాలయంలో

ఉదయం 10:00 గంటలకు మండల అధ్యక్షులు, మండల ఇన్ఛార్జుల సమావేశం.

మధ్యాహ్నం 3:00 గంటలకు జిల్లా పదాధికారుల సమావేశం.

సాయంత్రం 4:00 గంటలకు మోర్చాల అధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్ఛార్జుల సంయుక్త సమావేశం.

సాయంత్రం 5:00 గంటలకు: జిల్లా కోర్ కమిటీ సమావేశం.

ఈ మూడు రోజుల పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పిలుపునిచ్చారు. పైన పేర్కొన్న షెడ్యూల్ ప్రకారం జిల్లాలోని మండల అధ్యక్షులు, మండల ఇన్ఛార్జులు, జిల్లా పదాధికారులు, మోర్చాల అధ్యక్షులు, కోర్ కమిటీ సభ్యులు, రాష్ట్ర స్థాయి పదాధికారులు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# జనాభా నిర్వహణ పై అవగాహన పెంచుకోవాలి.





**..సెట్కూరు సీఈఓ - డాక్టర్. వేణుగోపాల్.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ జూలై 11:** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా దిన్నదేవరపాడు డాక్టర్ .బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకుంటారని, పెరుగుతున్న జనాభా సమస్యలు, పర్యావరణంపై దాని ప్రభావం, మరియు కుటుంబ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశమని,ఐక్యరాజ్యసమితి 1989లో ఈ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించిందన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో జనాభా నియంత్రణపై కాకుండా జనాభా నిర్వహణపై చర్చ జరగాలన్నారు.మారుతున్న ప్రపంచంలో సంబంధాలు, తల్లిదండ్రులుగా బాధ్యతలు, మరియు జీవిత లక్ష్యాల విషయంలో యువత యొక్క ఆశయాలను, ఎంపికలను అర్థం చేసుకోవడంపై దృష్టి సారించాలన్నారు.

జనాభా నిర్వహణ అనేది కేవలం జనాభాను తగ్గించడం మాత్రమే కాదని, ఇది మానవ వనరులను సద్వినియోగం చేసుకోవడం, వనరుల సమతుల్యతను సాధించడం మరియు వృద్ధాప్య సమాజంగా మారకుండా యువశక్తిని కాపాడే ఒక సమగ్ర సామాజిక-ఆర్థిక వ్యూహమన్నారు.

జనాభా అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు, అది దేశ ఆర్థిక, సామాజిక ప్రగతిని నిర్ణయించే అంశమని ప్రస్తుతం రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ 1.5గా ఉందని, 1993లో ఇది 3.0గా నమోదైందని వివరించారు. టీఎఫ్ఆర్ వేగంగా తగ్గితే పని చేసే వయస్సులో ఉన్నవారి సంఖ్య గణనీయంగా తగ్గి, ఆర్థిక వృద్ధి మందగిస్తుందని తెలిపారు.

ప్రపంచ జనాభా 8 బిలియన్లు దాటింది. జనాభా పెరుగుదల ఒకవైపు అభివృద్ధికి సూచికగా ఉన్నప్పటికీ, మరోవైపు నిరుద్యోగం, పేదరికం, పర్యావరణ కాలుష్యం మరియు వనరుల కొరతకు దారితీస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఆధునిక ప్రభుత్వాలు జనాభాను నియంత్రించడంతో పాటు, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా జనాభాను నిర్వహించే విధానాలను అవలంబిస్తున్నాయన్నారు.

2047 నాటికి ఏపీలో వృద్ధుల జనాభా 23 శాతం ఉంటుందని అంచనాలు తెలియచేస్తున్నాయి. జనాభా నిర్వహణ అనేది కేవలం ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలతోనే సాధ్యం కాదు. ప్రతి పౌరుడూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. "పిల్లలే సంపద" అనే నినాదంతో పాటు, వారి నాణ్యమైన జీవన ప్రమాణాలకు ప్రాధాన్యతనిచ్చినప్పుడే దేశ అభివృద్ధి మరియు సుస్థిర భవిష్యత్తు సాధ్యమవుతుందని వివరించారు.

# జిల్లాలో యూరియా సరఫరా సజావుగా సాగుతోంది.

**..జిల్లాలో అవసరమైనంత యూరియా నిల్వ అక్రమాలకు తావులేకుండా కఠిన చర్యలు.**

**..ఏపీఐఎంఎస్ యాప్‌తో పారదర్శక పంపిణీ.. అక్రమాలకు అడ్డుకట్ట.**

**..ఇప్పటివరకు 70 వేల మంది రైతులకు యూరియా పంపిణీ.**

**..తాగునీటి సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు.**

**..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 11:** జిల్లాలో యూరియా సరఫరా సజావుగా సాగుతోందని, అవసరమైన మేరకు ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. యూరియా పంపిణీలో పారదర్శకతను పెంపొందించడంతో పాటు అక్రమాలను పూర్తిగా అరికట్టేందుకు ఏపీ ఐఎంఎస్ యాప్‌ను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతులకు యూరియా సరఫరా, పంపిణీ, త్రాగునీరు సంబధిత అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు 45,599 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా, ఇప్పటివరకు 17,900 మెట్రిక్ టన్నుల యూరియా, అంటే దాదాపు 39 శాతం వినియోగం పూర్తయిందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 70 వేల మంది రైతులు యూరియాను కొనుగోలు చేసి వినియోగించుకున్నారని వెల్లడించారు. ప్రస్తుతం రవాణాలో ఉన్న నిల్వలతో కలిపి 28,540 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏపీ ఐఎంఎస్ యాప్‌తో పారదర్శక పంపిణీ గతంలో ఎరువుల పంపిణీలో చోటుచేసుకున్న పక్కదారి మళ్లింపులు, ఇతర పరిశ్రమలకు తరలింపు వంటి అక్రమాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ఐఎంఎస్ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ యాప్ ద్వారా రైతు ఆధార్ నంబర్ నమోదు చేసిన వెంటనే రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుందని, ఓటీపీ నమోదు చేసిన తర్వాత రైతు పేరు, భూమి విస్తీర్ణం, సాగు చేసిన పంట వివరాలు, మొదటి విడతలో ఇవ్వాల్సిన యూరియా, డీఏపీ బస్తాల సంఖ్య యాప్‌లో స్పష్టంగా కనిపిస్తాయని వివరించారు. చిన్న, సన్నకారు రైతులకు మొదటి విడతలోనే పూర్తి కోటా అందజేస్తుండగా, పెద్ద రైతులకు అవసరాన్ని బట్టి మూడు విడతల్లో ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. యూరియా పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 537 ఎరువుల విక్రయ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించగా, నిబంధనలు ఉల్లంఘించిన 96 కేంద్రాలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు. అలాగే 20 మంది డీలర్ల లైసెన్సులను సస్పెండ్ చేయడంతో పాటు 11 మంది డీలర్లపై ఎసెన్షియల్ కమోడిటీస్ చట్టం 6ఏ కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. తనిఖీల్లో భాగంగా సుమారు రూ.26 లక్షల విలువైన 45 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలను సీజ్ చేయగా, రూ 85 లక్షల విలువైన 412 మెట్రిక్ టన్నుల నిల్వలను డిటైన్ (హోల్డ్) చేసినట్లు తెలిపారు. యూరియా కొనుగోలుకు రైతులను బలవంతంగా ఇతర లింక్ ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేసే డీలర్లపై కూడా కఠిన చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. యూరియా కొనుగోలు సమయంలో అదనపు వస్తువులు కొనుగోలు చేయాలని ఎవరైనా ఒత్తిడి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించమని, ఎక్కడైనా అక్రమాలు గమనిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. రైతులకు అవసరమైన ఎరువులను పూర్తిస్థాయిలో అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, జిల్లాలో యూరియా కొరతకు అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు. జిల్లాలో వ్యవసాయ శాఖ ద్వారా ప్రధాన పంటతో పాటు అంతర పంటలు సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. పిఎండిఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) పద్ధతి ద్వారా సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఎల్నీనో నేపథ్యంలో ఈ పద్ధతిలో రైతులు పంటల సాగు ను ఆచరించాలని కలెక్టర్ సూచించారు.. జిల్లాలో 92,000 ఎకరాలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 83 వేల ఎకరాల్లో పిఎండిఎస్ పద్ధతి ద్వారా సాగు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు

జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారం కోసం 2 టీఎంసీల నీటిని విడుదల చేయాలని తుంగభద్ర డ్యామ్ అధికారులను కోరామని, మరో వారం రోజులలోపు తాగునీటిని ఇస్తామని అధికారులు చెబుతున్నారని కలెక్టర్ వివరించారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) కూడా ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అత్యవసర తాగునీటి అవసరాల కోసం పాత, నిరుపయోగంగా ఉన్న డెడ్ అకౌంట్ల నుంచి సుమారు రూ.3 నుంచి రూ.4 కోట్లు సమీకరించామని తెలిపారు. ఇందులో భాగంగా మంత్రాలయం బోర్‌వెల్‌ల కోసం రూ.1.10 కోట్లు, ఆలూరు నియోజకవర్గ తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు, అలాగే ఇన్‌చార్జి మంత్రి సహకారంతో వాటర్ రిజువెనేషన్, వాటర్ బాడీస్ పునరుద్ధరణ పనులకు రూ.1.50 కోట్లు మంజూరు చేయించామని చెప్పారు. తాగు నీటి సమస్యను అధిగమించేందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను కూడా వినియోగించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. సుమారు రూ.5 నుంచి రూ.6 కోట్ల విలువైన పనులకు అంచనాలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. తాగునీటి సమస్యలపై వచ్చే ప్రతికూల వార్తలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. సమస్యలు తలెత్తిన ప్రాంతాలకు వెంటనే ప్రత్యేక బృందాలను పంపించి తక్షణ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రెస్ కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు

# జాతీయ లోక్ అదాలత్ ద్వారా.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 62,225 కేసుల పరిష్కారం.






**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ జూలై 11:** జాతీయలోక్ అదాలత్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి గారైన జి. కబర్ధి ఆధ్వర్యంలో శనివారం 11-07-2026 న జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో ఉమ్మడి కర్నూలు నంద్యాల జిల్లాలలో 62225 కేసులు పరిష్కారం అయ్యాయి. 200 మోటార్ ఆక్సిడెంట్ కేసులలో 15,11,43,507/- బాధితులకు నష్టపరిహారంగా ఇన్సూరెన్స్ కంపెనీల నుండి ఇప్పించడం జరిగినది. శ్రీశైలం ప్రాజెక్టు భూసేకరణలో నష్టపోయిన 96 మంది రైతుల వారసులకు =ం. 42,00,000/- రూపాయలు నష్టపరిహారంగా ఇప్పించడం జరిగింది. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ మొత్తం రెండు జిల్లాల్లో 31 బెంచీలను ఏర్పాటు చేసి 548 సివిల్ కేసులు, 61292 క్రిమినల్ కేసులు, బ్యాంకు కేసులు 289 పరిష్కరించామని తెలిపారు. ఈ సమావేశంలో సిబిఐ కోర్ట్ అదనపు జిల్లా జడ్జి శోభా రాణి , ఆరవ అదనపు జిల్లా జడ్జి వాసు,ఏడవ అదనపు జిల్లా జడ్జి లక్ష్మి రాజ్యం, శాశ్వత లోకాదల చైర్మన్ వెంకట హరినాథ్, కర్నూలు బార్ ప్రసిడెంట్ చంద్రుడు , రిటైర్డ్ అదనపు జిల్లా జడ్జి లక్ష్మినరసింహారెడ్డి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మల్లేశ్వరి మరియు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సంధ్యా రాణి, రెండో అదనపు జూనియర్ సివిల్ సరోజనమ్మ, ఎక్సైజ్ కోర్టు జడ్జి అనిల్ కుమార్, మొబైల్ కోర్టు జడ్జి అనూష, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపర్ణ,కోర్టుమా నిటరింగ్ సి ఐ. రామానాయుడు, న్యాయ వాదులు, బ్యాంక్ అధికారులు, బి యస్ యన్ యల్ అధికారులు, పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారం లను వెంటనే అందజేయాలి.

**..జిల్లా ఎన్నికల అధికారి జిల్లా/జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు , జూలై 11:** ఎవరి ఓటు హక్కు తొలగించబడదని, ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారం లను వెంటనే అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి కోరారు.శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఏ సిరి పాత్రికేయులతో ఎస్.ఐ.ఆర్ పై సమావేశం నిర్వహించి జరుగుతున్న ప్రక్రియను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి పాత్రికేయులతో మాట్లాడుతూ...జిల్లాలో ఓటర్లు 20,86,000 ఉన్నారు , ఇప్పటి వరకుడిజిటలైజేషన్ చేసింది 82.27% ( అనగా 17,16,351 ), ఇంకా 3,69,768 చేయవలసినవి ఉన్నాయి.ఇందులో డిజిటలైజేషన్ ఎన్యూమరేషన్ ఫామ్స్ లో ఓటర్ సంవత్సరం 2002 లో ఉండొచ్చు లేక 2002 తర్వాత వారు అయ్యి ఉండొచ్చు లేదా క్రొత్త గా ఇప్పుడు ఓటర్ అయ్యి ఉండొచ్చు, వీరి అందరిని మ్యాపింగ్ చేయడం జరిగింది అని తెలిపారు . ఎన్యూమరేషన్ ఫార్మ్ లను 99.5% ఓటర్ ల కు పంపిణీ చేశాం అని తెలిపారు.శని, ఆది వారాల్లో స్పెషల్ క్యాంపైన్ పెట్టాము, ఇంకా ఎవరైనా ఎన్యూమరేషన్ ఫారం అందని వారు, బి ఎల్ వో కు సమర్పించని వారు శని, ఆది వారాల్లో అందచేయాలని, ఏవైనా సందేహాలు ఉంటే బుక్ ఏ కాల్ ద్వారా కూడా బిఎల్ఓ తో మాట్లాడవచ్చు అని తెలిపారు. సిబ్బంది ద్వారా 48 గంటల్లో వాళ్లకి ఫోన్ చేసి వాళ్ళ సందేహాలు తీర్చి క్లియర్ చేస్తున్నాం అని అన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా కర్నూలు జిల్లాలో బుక్ ఏ కాల్ ద్వారా 8 వేల ఫోన్ కాల్ లకు సమాధానం ఇచ్చామని తెలిపారు. ఈనెల జూలై 21 న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ తయారుచేసి ముద్రించడం జరుగుతుందని, అయితే ఇది ఫైనల్ రోల్ కాదు అని తెలిపారు. ఫార్మ్స్ ఇవ్వని వారి అందరికీ ఫోన్ చేయిస్తున్నాం, ఇంటి ఇంటికి సిబ్బంది వెళ్తున్నారు , పత్రికల ద్వారా, సోషల్ మీడియా ద్వారా తెలుపుతున్నాము, సమాచారం అందించమని కోరుతున్నామని, ఇన్ని విధాలుగా సమాచారం అందజేసిన తర్వాత కూడా ఇంకా కొద్దిమంది సమాచారం ఇవ్వటానికి రాకపోవచ్చు, ఎన్రోల్మెంట్ ఫామ్ తిరిగి రాకపోతే ఆబ్సెంట్ కింద నమోదు చేస్తాం లేదా ఇక్కడ ఓటు వద్దు అంటే షిఫ్టింగ్ అని నమోదు చేస్తారన్నారు.. మంగళవారం వరకు డిజిటలైజేషన్ ప్రాసెస్ జరుగుతుంది, అంత లోపల ఫార్మ్స్ అందజేయాలని తెలియజేశారు. ఎవరు కూడా భయపడద్దు, ఎవరి ఓటు హక్కు తొలగించమని తెలిపారు . ఇది డ్రాఫ్ట్ రోల్ మాత్రమే. ఫైనల్ కాదు అని, డ్రాఫ్ట్ రోల్ లో పేరు లేకపోతే మళ్లీ సంబంధిత ఓటరు కు నోటీస్ ఇచ్చి, తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అంతే తప్ప ఎవరి ఓట్లు తొలగించబడవని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్ - 2026 ప్రక్రియను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలి.

**-ఎన్యూమరేషన్ ఫారమ్‌ల డిజిటలైజేషన్‌లో ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి.**

**-పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 11:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాలో చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా వేగవంతంగా, పారదర్శకంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నంద్యాల పట్టణంలోని ఎం.ఎస్. నగర్ ప్రాంతంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారమ్‌ల డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 111 నుంచి 115 వరకు, అలాగే 125వ పోలింగ్ స్టేషన్ పరిధిలో చేపడుతున్న డిజిటలైజేషన్ పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి, నమోదు ప్రక్రియ, డేటా అప్‌లోడ్ విధానం, పత్రాల ధృవీకరణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో ప్రతి ఎన్యూమరేషన్ ఫారమ్‌ను అత్యంత జాగ్రత్తగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటర్ల వివరాల నమోదులో ఖచ్చితత్వం అత్యంత కీలకమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ఎన్నికల జాబితాపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. అనంతరం నంద్యాల పట్టణంలోని 108, 149 నుంచి 152 వరకు ఉన్న పోలింగ్ కేంద్రాలను కూడా జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడ కొనసాగుతున్న ఎస్ఐఆర్-2026 కార్యక్రమం అమలు తీరును పరిశీలించి, ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సేకరణ, డిజిటలైజేషన్, రికార్డుల నిర్వహణ, పెండింగ్ వివరాల పరిష్కారం వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఎన్యూమరేషన్ ఫారమ్‌ల డిజిటలైజేషన్‌ను నిర్దేశించిన కాలపట్టిక ప్రకారం వేగవంతం చేయడంతో పాటు, ప్రతి నమోదును క్షుణ్ణంగా పరిశీలించి మాత్రమే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫీల్డ్ స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి, ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని, పెండింగ్ లేకుండా ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ తప్పకుండా అమలు చేస్తూ ప్రజలకు పారదర్శకమైన, విశ్వసనీయమైన ఓటరు జాబితా అందించే దిశగా కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. ఈ తనిఖీలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, నంద్యాల అర్బన్ తహశీల్దార్ శ్రీనివాసులుతో పాటు సంబంధిత ఎన్నికల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేద్దాం




**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ జూలై 11:** ఈ నెల 15వ తేదీన మన ఆళ్లగడ్డ నియోజకవర్గానికి విచ్చేయనున్న రాష్ట్ర ఐటీ మరియు విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో, ఈరోజు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించడం జరిగింది. లోకేష్ బృందం సభ్యులు, ఆళ్లగడ్డ డీఎస్పీ, సీఐలు మరియు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించాను. బహిరంగ సభ వేదిక ఏర్పాటు, సభకు వచ్చే ప్రజల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు మరియు వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించాను.మన నియోజకవర్గానికి వస్తున్న మంత్రి గారి పర్యటనకు వచ్చే ప్రజలకు, కార్యకర్తలకు ఎక్కడా ఎలాంటి చిన్న అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించాను. ప్రతి ఏర్పాటును ముందుగానే ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి, ఈ పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతం చేయాలని అధికారులకు మరియు మన పార్టీ నాయకులకు, శ్రేణులకు దిశానిర్దేశం చేశాను. మన ఆళ్లగడ్డ ప్రగతికి సరికొత్త ఊపునిచ్చే ఈ పర్యటనను అందరం కలిసి దిగ్విజయం చేద్దాం.

# క్రాంతి నగర్, బొమ్మల సత్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.!

## -టీడీపీ రాష్ట్ర నాయకులు ఎన్ఎండి ఫయాజ్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 11:** నంద్యాల పట్టణంలోని క్రాంతి నగర్ మరియు బొమ్మల సత్రం ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, రహదారులు దెబ్బతినడం, తాగునీటి ఎద్దడి మరియు వీధి దీపాల లోపం వంటి సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

ప్రజా సమస్యలపై స్పందించిన ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తాము క్షేత్రస్థాయిలో గమనించామని, ఈ సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన అభివృద్ధి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో 32 వార్డ్ టీడీపీ ఇంచార్జి కొండ శ్రీనివాస్ యాదవ్, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నంద్యాలలో తొలిసారి జగన్నాథ రథయాత్ర.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 11:** నంద్యాల పట్టణంలో తొలిసారిగా ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ స్వామివారి రథయాత్రను ఈ నెల 16న గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ప్రతినిధి రఘువంశ రామ్ దాస్ తెలిపారు. ఎస్‌బీఐ కాలనీలోని ఇస్కాన్ ఆలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.పూరీ జగన్నాథ రథయాత్ర తరహాలో నిర్వహించే ఈ మహోత్సవం టెక్కె మార్కెట్ యార్డు నుంచి ప్రారంభమై పద్మావతి నగర్, టీటీడీ రోడ్, శ్రీనివాస్ సెంటర్, గాంధీ చౌక్, సంజీవ్ నగర్ గేట్ మీదుగా సౌజన్య కళ్యాణ మండపం వరకు వైభవంగా సాగనుంది. రథయాత్రలో నిత్యపూజలందుకునే శ్రీ జగన్నాథ, బలదేవ, సుభద్ర అమ్మవార్ల మూలవిరాట్టులను భక్తులు దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నారు.ముగింపు వేదిక వద్ద ప్రత్యేక పూజలు, 56 రకాల మహాభోగ నివేదన, మహా హారతి, జగన్నాథ లీలా ప్రవచనం, భక్తులకు నేతి దీపాల సమర్పణతో పాటు సుమారు రెండు వేల మందికి అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించనున్నారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.

# జిల్లా సీనియర్ చెస్ జట్ల ఎంపిక పోటీలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 11:**
నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో శనివారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జిల్లా సీనియర్ చెస్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగం మేధోశక్తి, ఏకాగ్రతను పెంపొందించే క్రీడ అని, విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు.

జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఈ నెల 18, 19 తేదీల్లో నంద్యాలలో రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు.డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవి కృష్ణ చెస్ బోర్డుపై తొలి ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, చెస్ సంఘం సభ్యులు, కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న 'అభిరుచి మధు' వ్యూహాలు..!

**-ఆయన వేస్తున్న అడుగులతో ఆలోచనలో పడ్డ ఇతర పార్టీల నేతలు**

**--జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు**

**--డిఫెన్స్‌లో పడుతున్న రాజకీయ ప్రత్యర్థులు**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 11:**
నంద్యాల జిల్లా రాజకీయ ముఖచిత్రంపై భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు తనదైన ముద్ర వేస్తున్నారు. ఇటీవలి కాలంలో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, క్షేత్రస్థాయిలో వేస్తున్న అడుగులు ఇతర పార్టీల రాజకీయ నాయకులను తీవ్ర ఆలోచనలో పడేస్తున్నాయి. తనదైన వ్యూహాలతో, ఎవరికీ అంతుచిక్కని రీతిలో ఆయన అడుగులు వేస్తున్న తీరు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

**వ్యూహాత్మక అడుగులు.. విపక్షాలకు సవాళ్లు**

ప్రజల సమస్యల పట్ల స్పందిస్తున్న తీరు, పార్టీ క్యాడర్‌ను కలుపుకుపోతూ బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు అభిరుచి మధు అనుసరిస్తున్న విధానాలు ఇతర పార్టీల నాయకులకు మింగుడుపడటం లేదు. స్థానికంగా ఉన్న పాత రాజకీయ సమీకరణాలను ఆయన ఒక్కసారిగా మార్చివేస్తున్నారు. ఏ కార్యక్రమం చేపట్టినా సమర్థవంతంగా, వ్యూహాత్మకంగా ముందుకు తీసుకువెళ్లడంలో ఆయన చూపుతున్న చొరవ ఇతర పార్టీల నేతలను ఆత్మరక్షణలో పడేస్తోంది.

**మారిన రాజకీయ సమీకరణాలు**

క్షేత్రస్థాయిలో ప్రజల నాడిని పట్టుకోవడంలో అభిరుచి మధు సఫలం అవుతుండటంతో ఆయన తదుపరి అడుగు ఏంటన్న దానిపై ప్రత్యర్థి శిబిరాల్లో ఉత్కంఠ నెలకొంది. ఆయన వేగాన్ని అందుకోలేక, వ్యూహాలను పసిగట్టలేక ఇతర పార్టీల నేతలు ఇప్పుడు తమ వ్యూహాలకు పదునుపెట్టే పనిలో పడ్డారు. నిన్నటి వరకు ఒక లెక్క.. ఇప్పుడు ఒక లెక్క అన్నట్లుగా నంద్యాల రాజకీయాల్లో అభిరుచి మధు చురుకైన పాత్ర పోషిస్తుండటంతో రాబోయే రోజుల్లో సమీకరణాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

# గుంతనాలలో ఘనంగా 'మన ఊరు - మన జెండా'..!

**-బూత్ స్థాయి నుంచే పార్టీ పటిష్టతకు కృషి -జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి**

**-బీఎల్‌ఏ-1, బీఎల్‌ఏ-2 లకు కీలక దిశానిర్దేశం. -పార్టీ బలోపేతమే లక్ష్యం:జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు.**








**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జూలై 11:** నంద్యాల మండలం గుంతనాల గ్రామంలో భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన ఊరు - మన జెండా' కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ ఎమ్మెల్యే, ఎస్ఐఆర్ రాష్ట్ర బీజేపీ కన్వీనర్ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆయన ఘనంగా ఆవిష్కరించారు. క్షేత్ర స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో, సైనికుడిలా పనిచేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

**బీఎల్‌ఏ లకు కీలక దిశానిర్దేశం**

జెండా ఆవిష్కరణ అనంతరం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీఎల్‌ఏ-1, బీఎల్‌ఏ-2 లతో పార్టీ ముఖ్య నాయకులు ఓ కీలక సమావేశాన్ని నిర్వహించారు. బూత్ స్థాయిలో ఓటర్ల నమోదు, పార్టీ నిర్మాణ పటిష్టత, కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకూ విస్తృతంగా తీసుకువెళ్లే వ్యూహాలపై ఈ సమావేశంలో కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి బాటలు వేయాలని సూచించారు.

**పార్టీ బలోపేతమే ధ్యేయం:జిల్లా బీజేపీ అభిరుచి మధు**

ఈ సందర్భంగా బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసే దిశగా పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్నట్లు స్పష్టం చేశారు. అధిష్ఠానం పిలుపుమేరకు ప్రతి బూత్ పరిధిలోనూ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ, పార్టీ విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన ఉద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, మండల స్థాయి ముఖ్య కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వకీల్ సాబ్ సుబ్బరాయుడు కు అభినందనలు..!

**-వకీల్ సాబ్ సుబ్బరాయుడు"చొరవతో బాధితులకు రూ.3.50 కోట్ల ఊరట.**

**..జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 3040 మోటారు ప్రమాద బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ.**

**..రాజీ మార్గమే రాజమార్గం.."త్వరిత న్యాయంతో బాధితులకు ఆర్థిక భరోసా..!**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 11:**
రహదారి ప్రమాదాల్లో తమ ఆత్మీయులను కోల్పోయి,పరిహారం కోసం ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతున్న బాధిత కుటుంబాలకు జాతీయ మెగా లోక్ అదాలత్ గొప్ప ఊరట కల్పించింది.నంద్యాల జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మోటారు ప్రమాద పరిహార కేసులకు వేగంగా పరిష్కారం లభించగా,బాధితులకు మొత్తం రూ.3 కోట్ల 50 లక్షల పరిహారం మంజూరైంది.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నంద్యాల మూడో అదనపు జిల్లా జడ్జి అమ్మన్న రాజు బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు.న్యాయవాదులు,ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి అమ్మన్న రాజు మాట్లాడుతూ..జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 125 మోటారు వాహన ప్రమాద పరిహార కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు.అలాగే జిల్లా కోర్టు పరిధిలో సివిల్ కేసులు,బ్యాంకు రికవరీ వ్యవహారాలు,ప్రీ-లిటిగేషన్ కేసులు తదితరంగా దాదాపు 300 కేసులు రాజీ మార్గంలో పరిష్కారమైనట్లు వెల్లడించారు. కక్షిదారులకు త్వరిత న్యాయం అందించాలనే లక్ష్యంతో న్యాయవాదులు విశేష కృషి చేశారని,రాజీ ద్వారా సమయం,ఖర్చు రెండూ ఆదా అవుతాయని ఆయన పేర్కొన్నారు."రాజీ మార్గమే రాజమార్గం"అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు. ఇన్సూరెన్స్ కంపెనీల తరఫున వ్యవహరిస్తున్న "న్యాయవాది సుబ్బరాయుడు" మాట్లాడుతూ..కంపెనీల సహకారం,"లీగల్ అడ్వైజర్ విజయశేఖర్ రెడ్డి"సమన్వయంతో 30 నుంచి 40 బాధిత కుటుంబాలకు రూ.3.50 కోట్ల పరిహారం అందించడం జరిగిందన్నారు.ప్రమాదాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయిన వారికి ఈ పరిహారం కొంతైనా ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు.బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా రాజీ చర్చలు విజయవంతం చేయడంలో న్యాయవాదులు,ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.న్యాయస్థానం వేదికగా బాధితులకు న్యాయం,ఆర్థిక భరోసా ఒకేసారి లభించడం జాతీయ మెగా లోక్ అదాలత్ ప్రధాన లక్ష్యమని న్యాయవర్గాలు అభిప్రాయపడ్డాయి.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# జూలై 14లోగా ఎన్యూమరేషన్ ఫారమ్‌లు సమర్పించాలి.

**..ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి.**

**..అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి ఒక్కరూ సహకరించాలి.**

**..జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 11:**
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి అర్హత కలిగిన ఓటరు తన ఎన్యూమరేషన్ ఫారమ్‌ను తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. జూలై 14తో ఈ ప్రత్యేక కార్యక్రమం ముగియనున్నందున మిగిలిన రోజులను సద్వినియోగం చేసుకొని ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆమె కోరారు. శనివారం వీడియో సందేశం ద్వారా జిల్లా ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, నంద్యాల జిల్లాలో ప్రస్తుతం 14,05,443 మంది ఓటర్లు నమోదై ఉన్నారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, విశ్వసనీయతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి రెండు ఎన్యూమరేషన్ ఫారమ్‌లను అందజేస్తున్నారని తెలిపారు. ఒక ఫారమ్‌ను ఓటరు స్వీకరించినట్లు అక్నాలెడ్జ్ చేయగా, రెండవ ఫారమ్‌ను అవసరమైన వివరాలతో పూరించి తిరిగి బూత్ లెవెల్ అధికారులకు అందజేయాల్సి ఉంటుందని వివరించారు. అందిన ఫారమ్‌లన్నింటినీ డిజిటలైజ్ చేసి తుది ఓటరు జాబితా తయారీకి వినియోగిస్తామని తెలిపారు. ఫారమ్‌ను తిరిగి సమర్పించని పక్షంలో సంబంధిత ఓటరు పేరు రాబోయే డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌లో నమోదు కాకపోయే అవకాశం ఉందని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 10,90,722 ఎన్యూమరేషన్ ఫారమ్‌లు ఓటర్ల నుంచి తిరిగి అందగా వాటిని విజయవంతంగా డిజిటలైజ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే బూత్ లెవెల్ ఏజెంట్ల సహకారంతో మరణించిన వారు, డూప్లికేట్ నమోదులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లను గుర్తించి, అలాంటి 55,449 ఫారమ్‌లను కూడా డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇంకా 2,59,272 ఎన్యూమరేషన్ ఫారమ్‌లు ఓటర్ల నుంచి అందాల్సి ఉందన్నారు. మిగిలిన ఫారమ్‌ల సేకరణను వేగవంతం చేసేందుకు శనివారం, ఆదివారం జిల్లావ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జూలై 14 గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఓటరు బాధ్యతగా స్పందించి తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌ను వెంటనే సంబంధిత బూత్ లెవెల్ అధికారికి అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విజ్ఞప్తి చేశారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, బూత్ లెవెల్ ఏజెంట్లు, అధికారులు సమిష్టిగా సహకరించాలని కోరారు. పారదర్శకమైన, సమగ్రతతో కూడిన, తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి ఓటరి భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనదని కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు

# నంద్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా విజయ్ కుమార్ బాధ్యతల స్వీకారం.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 11:** నంద్యాల జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సూపరింటెండెంట్ గా ఎస్. విజయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. వీరు 2005వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 నోటిఫికేషన్ ద్వారా సబ్-ఇన్స్పెక్టర్ గా ఎంపికయ్యారు.తన సుదీర్ఘ సర్వీసులో భాగంగా వీరు వైఎస్ఆర్ కడప జిల్లాలోని ముద్దనూరు, ప్రొద్దుటూరు స్టేషన్లలోనూ, చిత్తూరు మరియు అనంతపురం జిల్లా తాడిపత్రి స్టేషన్లలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. గతంలో, 2024 ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా నంద్యాలలో సి.ఐ.గా కూడా సేవలు అందించారు. ఇటీవల జరిగిన పదోన్నతులలో భాగంగా వీరు అసిస్టెంట్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొంది, ప్రస్తుతం నంద్యాల జిల్లాలో బాధ్యతలు చేపట్టారు.


# మైనారిటీల సంక్షేమ ఆద్యుడు ఎన్ టీ ఆర్.

**.ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుంటే ఉజ్వల భవిష్యత్తు. -.ఉద్యోగ, ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి.**

**..మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్. -.మెగా జాబ్ మేళాకు విశేష స్పందన.**

**..ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన మంత్రి ఫరూక్.**






**ఆంధ్ర ప్రగతి విజయవాడ , జులై 11:**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మైనారిటీ వర్గాల సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేకంగా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి వారి సంక్షేమానికి ఆధ్యుడిగా దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు నిలిచారని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శనివారం విజయవాడ నగరంలోని ఇస్లాంపేటలో ఉన్న షాజహూర్ మూసాఫిర్ ఖానా లో మైనారిటీ నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనకు మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు దాదాపు 70 అంతర్జాతీయ, జాతీయ ప్రఖ్యాతిగాంచిన కంపెనీలు పాల్గొని, ప్రతిభ కలిగినవారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి నియామక పత్రాలు అందజేశారు. ఉదయం 9 గంటలకు మెగా జాబ్ మేళాను మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మైనారిటీ నిరుద్యోగ యువతను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి వరకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే మైనారిటీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. పేదరికం, నిరక్షరాస్యత, తదితర కారణాల చేత మైనారిటీలు ఎంతో వెనుకబడి, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని దివంగత సీఎం ఎన్ టీ ఆర్ దూర దృష్టితో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ను 1985లో ఏర్పాటు చేసిన విషయాన్ని మంత్రి విశదీకరించారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ, స్వయం ఉపాధి, ఉద్యోగాల కల్పన, సరళీకృతమైన రీతిలో రుణాలు మంజూరు, తదితర ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని అన్నారు. ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని , సద్వినియోగం చేసుకున్నప్పుడే మైనారిటీలు ఉన్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా బడ్జెట్ ను కేటాయించడం జరిగిందన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన నిమిత్తం విదేశాల్లో సైతం ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన రీతిలో సంక్షేమానికి కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. భారతీయ భాషలే కాకుండా ఇతర దేశాల భాషలు జర్మన్, చైనీస్, తదితర భాషల్లో ప్రావీణ్యం సంపాదిస్తే విదేశీ ఉద్యోగ అవకాశాలు అందుపుచ్చుకోవచ్చని మంత్రి ఫరూక్ యువతను కోరారు. మైనారిటీ నిరుద్యోగ యువత కోసం ప్రత్యేకంగా జాబ్ మేళా నిర్వహణకు చొరవ తీసుకున్న మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ మౌలానా, ఎండి యాకుబ్ భాష లను మంత్రి అభినందించారు. జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి మంత్రి ఫరూక్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, రిటైర్డ్ ఐపిఎస్, మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్, ఇతర డైరెక్టర్లు, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా సీనియర్ చదరంగం జట్ల ఎంపిక పోటీలు.

**..ప్రారంభించిన డాక్టర్ రామకృష్ణ రెడ్డి, డాక్టర్ రవి కృష్ణ. -.చదరంగం మేధో శక్తిని,ఏకాగ్రతను పెంచుతుంది: డాక్టర్ రామకృష్ణారెడ్డి.**

**..ఈనెల 18,19వ తేదీలలో నంద్యాలలో రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహిస్తున్నాం: జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 11:**నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో శనివారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల జిల్లా సీనియర్ చదరంగం జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చదరంగం మేధో శక్తిని,ఏకాగ్రతను ఇనుమడింప చేస్తుందని అన్నారు.తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలని కోరారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ చదరంగం క్రీడ వలన బాలలలో మానసిక వికాసం కలుగుతుందని, క్రీడలు విద్యార్థులలో గెలుపు ఓటములను స్వీకరించే మనస్తత్వం, ఓటమి చెందాక తిరిగి గెలవాలనే పట్టుదల పెంచుతాయని అన్నారు. నిరంతర సాధన ద్వారా చదరంగంలో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని కోరారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు నంద్యాల లో ఈనెల 18,19వ తేదీలలోజరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.డాక్టర్ రామకృష్ణారెడ్డి,డాక్టర్ రవి కృష్ణ చెస్ బోర్డుపై పావులు కదిపి చదరంగం పోటీలను లాంచనంగా ప్రారంభించారు. 200 మంది పైగా చదరంగం క్రీడాకారులు జిల్లా నలుమూలల నుండి వచ్చి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సందీప్, మేడా చంద్రశేఖర్, జోనల్ చైర్మన్ సోమేశుల నాగరాజు,చెస్ సంఘం సంయుక్త కార్యదర్శులు ఇమామ్, రాజా రమేష్ చక్రవర్తి, కోచ్ లు అరుణ్, మాలిక్ భాషా, సురేష్, అధిక సంఖ్యలో క్రీడాకారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# దక్షిణాది గాన కోకిల

## జానకమ్మ మృతి దేశానికి తీరని లోటు.!





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 11:**
దివికేగిన సంగీత సుప్రసిద్ధ గాయని జానకమ్మ 88 సంవత్సరాల వయస్సులో ఆమె మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామంలో శ్రీరామమూర్తి, సత్యవతి దంపతులకు 1938 వ సంవత్సరంలో ఏప్రిల్ 23న జన్మించారు. జానకమ్మ తండ్రి శ్రీరామమూర్తి ఉపాధ్యాయుడు మరియు ఆయుర్వేద వైద్యుడు. ఆయన ఉద్యోగరీత్యా కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లలో ఉండేవాడు. చిన్నతనము నుంచి జానకమ్మ గారికి సంగీతం పట్ల ఎంతో మక్కువ చూపేవారని తన మూడో ఏట నుంచి అనేక కార్యక్రమాలలో పాల్గొనడం మొదలు పెట్టి ఉద్దండులైన సంగీత విద్వాంసుల వద్ద శిష్యరికం చేసింది బాల్యంలోనే సినీ సంగీతంపై ఆకర్షితురాలై లతా మంగేష్కర్, పి. సుశీల, జిక్కి , పి.లీల, పాడిన పాటలు తన కార్యక్రమాలలో జానకమ్మ గారు పాడినట్లు మనకు తెలుస్తుంది.ఆరు దశాబ్దాలకు పైగా సంగీత కెరీర్ లో 50 వేలకు పైగా పాటలు పాడి నాలుగు జాతీయ అవార్డులు 33 రాష్ట్ర ప్రభుత్వ అవార్డులను జానకమ్మ సొంతం చేసుకున్నారు. అయితే 2013 వ సంవత్సరంలో ఆమెకు ప్రకటించిన "పద్మభూషణ్" అవార్డును దక్షిణాది కళాకారులకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ అవార్డును తిరస్కరించడం జరిగింది. జానకమ్మ గారి ప్రయాణం గాయనిగా 1957వ సంవత్సరంలో "విధియిన్ విలయాడల్" తమిళం మరియు ఎమ్మెల్యే తెలుగు చిత్రాలతో మొదలైంది. జానకమ్మ గారు తెలుగు, తమిళం, కన్నడ ,మలయాళం, హిందీ, జర్మనీ, చైనీస్, ఒరియా, ప్రపంచంలోని 17 భాషల్లో తన మధురమైన గానాన్ని ప్రపంచానికి అందించారు. ఆమె గాత్రములో ప్రత్యేకత ఉంటుంది. చిన్నపిల్లల పాటల నుండి వయోవృద్ధుల పాత్రల వరకు స్వరాన్ని మార్చి పాడగల మహా అద్భుతమైన అనుకరణ నైపుణ్యంతో పాడడం ఆమె సొంతం.

### ప్రాముఖ్యమైన జాతీయ అవార్డులు

డాక్టర్ జానకమ్మ నాలుగు సార్లు ఉత్తమ గాయనిగా జాతీయ పురస్కారాలను అందుకున్నారు. 1977 వ సంవత్సరంలో పదినారు వయదినిలే (తమిళం) 1980వ సంవత్సరంలో శంకరాభరణం (తెలుగు) 1984 వ సంవత్సరంలో సీతాకోకచిలుక (తెలుగు) 1992 వ సంవత్సరంలో ఏరి పీలకూ ఓరు కూడు (మలయాళం) తదితరు భాషల్లో ఆమె పురస్కారాలు అందుకున్నారు. ఎస్ జానకమ్మ జీవిత ప్రయాణం మధురమైన గానాన్ని ప్రపంచానికి అందించారు. జానకమ్మ గారు అందరికీ పరిచయమైన శిష్ట శ్రీరామ మూర్తి జానకి భారతీయ నేపథ్య గాయని జానకమ్మ గారు తన 60 సంవత్సరాల సినీ జీవితంలో అనేక భాషలలో పాటలు పాడి సంగీత ప్రపంచంలో ఉత్తమ గాయనిగా నాలుగుసార్లు జాతీయ పురస్కరంలు వివిధ రాష్ట్రాల నుంచి 33 సార్లు పురస్కారాలు పొందినది. మైసూర్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసినది మలయాళం కన్నడ భాషలలో ఎక్కువ పాడినట్లు కూడా మనకు చరిత్ర ద్వారా తెలుస్తుంది. ఆమె వయోభారంతో మైసూర్ అపోలో హాస్పిటల్ లో అనారోగ్యముతో ఈరోజు తుదిశ్వాస విడిచారు . అయితే తన కుమారుడు మురళీకృష్ణ చనిపోయినప్పటి నుంచి మనోవేదనకు గురై మానసికంగా కూడ కృంగిపోవడంతో 11-07-2026 న కార్డియాక్ అరెస్టుతో మైసూరు ఆసుపత్రి నందు మృతి చెందారు నైటింగేల్ ఆఫ్ ఇండియా జానకమ్మ మృతి చెందడం తీరనిలోటు ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆమె పాదాలకు నమస్కరిస్తూ భగవంతుని ప్రార్థిస్తున్నాను.



### ఇళయరాజా గీతాలకు ఆమె గొంతు ప్రాణం పోసింది

ఐదు దశాబ్దాలకు పైగా సాగిన ఆమె సంగీత ప్రయాణంలో ఎన్నో అపురూపమైన గీతాలు జన్మించాయి. ప్రేమ, విరహం, భక్తి, జానపదం, శాస్త్రీయ సంగీతం.. ఏ భావాన్నైనా తన స్వరంలో ఒదిగి పాడగల అరుదైన ప్రతిభ ఆమె సొంతం. సంగీత దర్శకుడు ఇళయరాజా స్వరపరిచిన ఎన్నో చిరస్మరణీయ గీతాలకు ఆమె గొంతు ప్రాణం పోసింది. అలాగే గానగంధర్వుడు ఎస్.పి. బాల సుబ్రహ్మణ్యంతో కలిసి పాడిన వేలాది యుగళగీతాలు నేటికీ సంగీతాభిమానులను అలరిస్తూనే ఉన్నాయి.
తన గాన ప్రతిభకు గుర్తింపుగా జానకి నాలుగు జాతీయ ఉత్తమ గాయని పురస్కారాలు, 30కి పైగా రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్నారు. అవార్డులు, సన్మానాలు ఎన్నో అందుకున్నా, సాధారణ జీవనశైలిని ఎప్పుడూ విడిచిపెట్టలేదు. వినయం, నిరాడంబరత ఆమె వ్యక్తిత్వానికి చిరునామాలుగా నిలిచాయి.

### భారతీయ సినీ సంగీత రంగం ఓ అమూల్యమైన స్వరాన్ని కోల్పోయింది

వ్యక్తిగత జీవితంలో ఇటీవల వరుస విషాదాలు ఆమెను తీవ్రంగా కలచివేశాయి. ఈ ఏడాది జనవరి 22న కుమారుడు మురళీకృష్ణ మృతి చెందడంతో జానకి తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఆ దుఃఖం నుంచి పూర్తిగా కోలుకోకముందే ఆరోగ్యం మరింత క్షీణించింది. చివరకు వృద్ధాప్య సమస్యలతో పోరాడుతూ ఆమె శాశ్వత నిద్రలోకి జారుకున్నారు.ఎస్. జానకి మరణంతో భారతీయ సినీ సంగీత రంగం ఓ అమూల్యమైన స్వరాన్ని కోల్పోయింది. ఆమె ఆలపించిన వేలాది పాటలు తరతరాలకు సంగీతానందాన్ని పంచుతూనే ఉంటాయి. గాన కోకిల స్వరం మూగబోయినా.. ఆమె గానం మాత్రం ఎప్పటికీ అమరగానంగా సంగీతాభిమానుల హృదయాల్లో మారుమోగుతూనే ఉంటుంది.